క్లుప్తంగా

వైభవంగా దేవర



పూజలందుకున్న సారమ్మ

సి.బెళగల్: మండలంలోని ఇనగండ్ల గ్రామ దేవతలు మారెమ్మ, సారమ్మ, సుంకులమ్మ దేవరను బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మంగళవారం అర్ధరాత్రి అనంతరం గ్రామోత్సవంలో భాగంగా మొదలైన అమ్మవార్ల ప్రతిమల ఊరేగింపు బుధవారం తెల్లవారుజామున ఆలయాలకు చేరుకుంది. గ్రామస్తులు అమ్మవారికి పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. దేవర నేపథ్యంలో ఎస్‌ఐ తిమ్మారెడ్డి ఆధ్వర్యంలో బందోబస్త్ నిర్వహించారు.

సూర్యనారాయణుడికి విశేష పూజలు



స్వామివారికి నక్షత్ర హారతి ఇస్తున్న అర్చకుడు

కర్నూలు కల్చరల్: స్థానిక సూర్యనారాయణ స్వామి ఆలయంలో బుధవారం వృషభ సంక్రమణ పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి మూల విరాట్‌కు పురుష సూక్త విధానంతో అరుణ పారాయణం, సుగంధద్రవ్య జలాభిషేకం, క్షీరాభిషేకం, విశేషాలంకరణ, అర్చన, నక్షత్ర మహా మంగళహారతి, అరుణ, మహాసౌర హోమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

భక్తులకు మెరుగైన సౌకర్యాలు



కొత్తూరు క్షేత్రంలో షెడ్ల నిర్మాణం

పాణ్యం: మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో వెలసిన సుబ్రమణ్యేశ్వరస్వామి ఆలయానికి భక్తుల తాకిడిని దృష్టిలో ఉంచుకున్న అధికారులు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నారు. దాతల సహకరం, ప్రభుత్వ నిధులతో షెడ్ల నిర్మాణం, భక్తులకు విడిది గదులు, ప్రత్యేక దర్శన క్యూలైన్లు తదితర అభివృద్ధి పనులు చేస్తున్నారు. ఎన్నికల సమయం కావడంతో పనుల్లో కొంత జాప్యం నెలకొంది. ఎన్నికల కోడ్ ముగియగానే నిర్మాణ పనులు పూర్తి చేసి భక్తులకు అందుబాటులోకి తీసుకురానున్నారు.


17న వేలం పాటలు

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉరుకుంద ఈరన్నస్వామి ఆలయంలో ఈనెల 17న వివిధ వ్యాపారాల లైసెన్స్ కోసం వేలం పాటలు నిర్వహించనున్నట్లు ఆలయ డిప్యూటి కమిషనర్, వెంకటేశ్, ట్రస్టుబోర్డు చైర్మన్ నాగరాజ్‌గౌడ్ తెలిపారు. వారు బుధవారం మాట్లాడుతూ.. 17న వేలం పాట ఉంటుందని, ఆసక్తి కల్గిన వారు పాల్గొనవచ్చన్నారు. అలాగే 18న స్వామివారి హుండీ ఆదాయం లెక్కించనున్నట్లు తెలిపారు.

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఆలూరు రూరల్: ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో 2024-25 విద్యాసంవత్సరం ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆలూరు ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ సూరప్ప బుధవారం తెలిపారు. కళాశాలలో ఎలక్ట్రీషియన్, డ్రాఫ్ట్‌మెన్ సివిల్, మెకానిక్ డీజిల్, వెల్డర్, డ్రెస్ మేకింగ్, కంప్యూటర్ కోర్సులకు అడ్మిషన్లు జరుగుతున్నట్లు చెప్పారు. ఐటీఐ కళాశాలలో చదివేందుకు అడ్మిషన్లు ఈ నెల 11వ తేదీ ప్రారంభమయ్యాయని, ఆసక్తి గల విద్యార్థులు జూన్ 10 తేదీ సాయంత్రం 5 గంటల్లోపు ఠిఠిఠి.జీజీ్ట.జ.ౌటి.జీ ఽ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తమ సర్టిఫికెట్లను ఆలూరు ప్రభుత్వ ఐటీఐ కళాశాలతో పాటు ఏదేని ప్రభుత్వ ఐటీఐలో జూన్ 10వ తేదీలోపు వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. మొదటి విడత దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు గవర్నమెంట్ ఐటీఐ బి.తాండ్రపాడు కర్నూలులో కౌన్సిలింగ్‌కు హాజరుకావాల్సి ఉంటుందని వెల్లడించారు. కౌన్సిలింగ్ అనంతరం అక్కడే కళాశాల సీటు కేటాయిస్తారని చెప్పారు.

తస్మాత్ జాగ్రత్త



బ్రిడ్జిపై బయటకొచ్చిన విద్యుత్ వైర్లు

పాణ్యం: మండల కేంద్రంలోని జాతీయ రహదారి బ్రిడ్జి (వీయూపీ)పై నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. బ్రిడ్జిపై రాత్రి వేళ విద్యుత్ దీపాల కొసం ఏర్పాటు చేసిన విద్యుత్ వైర్లు బయటకొచ్చాయి. ఈ వైర్లపైనే వాహనాలు వెళ్తున్నాయి. హైవే అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. దీనికి తోడు వర్షాలు కురుస్తుండడంతో వాహనదారులు, బాటసారులు భయాందోళనకు గురవుతున్నారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలని వాహనదారులు కోరుతున్నారు.

ఖరీఫ్ సీజన్‌కు సిద్ధమవుదాం

- లోతు దుక్కులతో ఎన్నో ఉపయోగాలు
- పొలాల్లో గొర్రెలు మంద కట్టడం వల్ల సేంద్రీయ పదార్థాన్ని పెంచవచ్చు
- నేల గుల్లబారుతుంది.. సకాలంలో విత్తనం వేసుకోవచ్చు
- కర్నూలు సబ్ డివిజన్ ఏడీఏ సాలురెడ్డి సూచనలు



వేసవి దుక్కులు చేస్తున్న రైతు

కర్నూలు అగ్రికల్చర్: వేసవి.. పొలాల్లో పంటలు లేని సమయం. అతి ముఖ్యమైన పొలం పనులు చేపట్టాల్సింది వేసవిలోనే. తొలకరితో మొదలయ్యే ఖరీఫ్ సీజన్‌కు ఇప్పటి నుంచే సమాయత్తం కావాల్సిన అవసరం ఉంది. వేసవిలో చేసుకునే పొలం పనులను బట్టే పంటల పెరుగుదల, దిగుబడులు వస్తాయి. వేసవిలో చేపట్టాల్సిన పనులను కర్నూలు సబ్ డివిజన్ ఏడీఏ సాలురెడ్డి వివరించారు. ఈ పనులు చేసుకుంటే కలిగే ఉపయోగాలను వివరించారు.

లోతు దుక్కులు

ఇటీవల జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో అకాల వర్షాలు కురిశాయి. ప్రస్తుతం దుక్కులు చేసుకోవడానికి సరిపడా తేమ ఉన్న పొలాల్లో ట్రాక్టర్లు లేదా ఎద్దుల నాగళ్లతో లోతు దుక్కులు దున్నాలి. ఈ దుక్కుల లోతు సుమారుగా 9 అంగుళాలకు తగ్గకుండా ఉండాలి. అలా లోతు దుక్కులు వేసవిలో చేసినప్పుడు పలు రకాల ప్రయోజనాలు చేకూరుతాయి. వాలుకు అడ్డంగా దున్నుకోవడం అవసరం. వర్షాలు తగ్గినందున వాలుకు అడ్డంగా దున్నుకోవడం ద్వారా వర్షపు నీరు భూమిలోకి బాగా ఇంకిపోతుంది.

నేలలో ఉండే చీడ పీడలు నశిస్తాయి

లోతు దుక్కులు దున్నినప్పుడు నేలపై పొరల్లో ఉండే పురుగులు, తెగుళ్లను నశింపజేయడానికి అవకాశం ఉంది. నేలలో దాక్కునే లేదా నిద్రావస్థలో ఉంటే పురుగులు, నేలలో ఉండి తెగుళ్లను కలగజేసే శిలీంద్రాలు ఎండల బారిన పడి నశిస్తాయి. అందువల్ల ఈ వేసవి కాలంలో పంట కోతలు పూర్తయిన వెంటనే పొలాలను ట్రాక్టరు లేదా ఎద్దులతో లాగే పరికరాలతో లోతు దుక్కి చేసుకుంటే తొలకరిలో విత్తుకునే పంటకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

పశువులు/గొర్రెలు మందకట్టడం

లోగడ ప్రతి రైతుకు ఎద్దులు, ఆవులు, గేదెలు ఉండేవి. వాటిని రాత్రిళ్లు పొలంలో కట్టేసేవారు. వాటి మల మూత్రాలు పొలానికి తిన్నగా చేరి పంటలకు ఉపయోగపడేవి. ఇందువల్ల ఎరువుల ఖర్చు తగ్గేది. ఇప్పుడు పొంచకట్టేసే పశుగణాలు తగ్గిపోయాయి. పశుగణం ఎక్కువగా ఉండే గ్రామాల్లోనూ ఈ పని ఇప్పటికైనా చేయవచ్చు. గొర్రెలను పొలంలో మందకట్టడం రైతులకు పరిపాటే. ఈ పని ఎండాకాలంలోనే చేయాలి. నిద్రలో ఉన్న గొర్రెల మందలను రాత్రిళ్లు ఎక్కువసార్లు లేపితే ఎక్కువసార్లు పెంటికలను వేస్తాయి. దీనివల్ల చేనుకు అవసరమైనంత గొర్రెల ఎరువు, మూత్రం లభ్యమవుతుంది. ఈ సేంద్రీయ ఎరువులను అందించడం వల్ల ఉత్పత్తులను లాభసాటిగా సాధించవచ్చు.

మొండిజాతి కలుపు నివారణ

తుంగ, గరిక, దర్బ వంటి మొండిజాతి కలుపు మొక్క పొలంలో పెరిగి పంటలకు నష్టం కలగజేస్తుంటాయి. వీటి వేర్లు, కాయలు, దుబ్బులు నేలలో కూడా బాగా విస్తరించి ఉండడం వల్ల నివారణ కష్టం అవుతుంది. పంటలు వేసినప్పుడు వాటితో పాటు పెరిగి నష్టపరుస్తాయి. వేసవిలో దుక్కి బాగా దున్నినప్పుడు ఈ కలుపు మొక్కల కాయలు, వేర్లు దుంపలు పెకలింపబడి, వేసవిలో ఉండే అధిక ఉష్ణోగ్రతలకు నశించడానికి అవకాశం ఉంటుంది. నేలపైకి తేలిన కాయలు, వేర్లు దుంపలను ఏరి వేసుకొని వీటిని అరికట్టవచ్చు.

నేల గుల్లబారుతుంది

వేసవిలో లోతుగా దుక్కి దున్ని తొలకరి వర్షాలకు గొర్రు తిప్పి గుంటలతో సేద్యం చేస్తే వేర్లు బాగా విస్తరించడానికి అనుకూలంగా ఉంటుంది. నేల అధికంగా నీటిని పీల్చుకుంటుంది. సేద్యానికి ఉపయోగించే గొర్రు, గుంటక, దంతెల వంటి పరికరాలు నేల లోపలికి 3-5 అంగుళాల లోతు వరకు చొచ్చుకొనిపోతాయి. ఈ పరికరాలను ఉపయోగించి పదే పదే సేద్యం చేయడం వల్ల నేల లోపల సుమారుగా 3-5 అంగుళాల లోతులో ఒక గట్టి పొర ఏర్పడుతుంది. అందువల్ల నేలకు నీటిని పీల్చుకునే శక్తి తగ్గుతుంది. కావున నేలను లోతుగా దున్నినప్పుడు ఈ గట్టి పొర ఛేదింపబడి నేలకు నీటిని పీల్చుకునే శక్తి అధికమవుతుంది.

సేంద్రీయ పదార్థం నేలలో కలుస్తుంది

పంటల కోతల తర్వాత నేలపై మిగిలే పంటల మొదళ్లు పొలంలో మిగిలిన కలుపు మొక్కలు, పంటల నుంచి రాలిపడిన ఆకులు వంటి వివిధ సేంద్రీయ పదార్థాలన్నీ లోతు దుక్కి దున్నినప్పుడు నేలలో కలిసి కుళ్లిపోతాయి. అందువల్ల నేలలో సేంద్రీయ పదార్థాలు, పోషక విలువలు పెరగడానికి అవకాశం ఉంది.

పశువుల ఎరువులను తోలడం

సంవత్సరం పొడవునా నిలువ చేసిన పశువుల ఎరువులను ఎండా కాలంలోనే పొలాల్లోకి తోలాలి. వర్షాలు పడిన తర్వాత పొలాలకు తోలిన పశువుల ఎరువులను నేలపై చల్లి లోతు దుక్కి దున్నితే మట్టిలో బాగా కలుస్తుంది. దీనివల్ల పంటలకు అవసరమైన పోషకాలు అందుతాయి.

నేటి నుంచి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలు

కృష్ణగిరి: మండల పరిధిలోని అమకతాడు గ్రామంలో వెలసిన వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలను గురువారం నుంచి నాలుగు రోజులపాటు వైభవంగా జరుగున్నాయి. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తి చేశామని గ్రామస్తులు తెలిపారు. గురువారం ఉదయం 5 గంటలకు సుప్రభాతం, వేదపారాయణం, పంచబ్రహ్మ ఉపనిషత్తు పారాయణంతో ఆరాధనోత్సవాలు ప్రారంభమవుతాయి. 9 గంటలకు కుంకుమార్చన, 11 గంటలకు కలశతీర్థం, రాత్రి 8 గంటలకు స్వామి, అమ్మవార్ల కళ్యాణం, 9 గంటలకు బ్రహ్మంగారి ఉచిత నాటక ప్రదర్శన ఉంటుందని గ్రామస్తులు తెలిపారు. 17న వీరబ్రహ్మేంద్రస్వాముల వారి ఆరాధన గురుపూజ మహోత్సవం ఉంటుందన్నారు. సాయంత్రం నాలుగు గంటలకు నందికోల ప్రభోత్సవం, ముత్యాల తేరుపై ఉత్సవాలు ఊరేగింపు ఉంటుందని తెలిపారు.

17న రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు

వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాల్లో భాగంగా 17న రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. విజేత జట్లకు దాతల సహకారంతో వరుసగా రూ. 20వేలు, రూ. 15వేలు, రూ.10వేలు చొప్పున అందిచడం జరుగుతుందన్నారు. అదేవిధంగా 18న పాలపళ్ల ఎద్దుల బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నామని, గెలుపొందిన ఎద్దుల యాజమానులకు రూ.30వేలు, రూ.20వేలు, రూ.10వేలు, రూ5వేలు చొప్పున బహుమతులు అందించనున్నారు. 19న న్యూ కేటగిరి విభాగంలో బండలాగుడు పోటీలు ఉంటాయన్నారు. విజేత వృషభాల యాజమాన్యాలకు వరుసగా రూ. 40వేలు, రూ.30వేలు, రూ.20వేలు, రూ10వేలు చొప్పున దాతల సహకారంతో అందిస్తామన్నారు.

18 నుంచి లక్ష్మీ నరసింహుని ఉత్సవాలు

- 21న కల్యాణోత్సవం, రథోత్సవం



నవరత్నాల లక్ష్మీనరసింహస్వామి



సిద్ధమవుతున్న రథం

కోడుమూరు రూరల్: మండలంలోని ముడుమలగుర్తి గ్రామంలో వెలసిన నవరత్నాల లక్ష్మీనరసింహ ఈరన్న స్వామి ఉత్సవాలను ఈనెల 18వ తేదీ నుంచి అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా 18న గణపతి పూజ, స్వామి వారికి అభిషేకం, 19న ప్రభోత్సవం, 20న కలశపూజ, వాస్తుపూజ, 21న గణపతి పూజ, పుణ్యహావాచనం, అభిషేకం, కల్యాణోత్సవం, మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం రథోత్సవం నిర్వహించనున్నారు. 22వ తేదీ నందికోలసేవ, చక్రస్నానంతో ఉత్సవాలు ముగుస్తాయని ఆలయ పూజారి రంగన్న స్వామి తెలిపారు.

22న బండలాగుడు పోటీలు

ఉత్సవాల్లో భాగంగా ఈనెల 22వ తేదీ ముడుమలగుర్తి గ్రామంలో 6 పాలపండ్ల ఎద్దులతో బండలాగుడు పోటీలు నిర్వహించనున్నారు. గెలుపొందిన వృషభాల యజమానులకు రూ.40,000, రూ.30,000, రూ.15,000, రూ.10,000 చొప్పున బహుమతులు అందజేయనున్నారు.

ఆరోగ్య పరిరక్షణలో టీకా కీలక పాత్ర



వైద్య సిబ్బందికి సూచనలు చేస్తున్న డీఎంహెచ్‌ఓ

కర్నూలు(హాస్పిటల్): పిల్లల ఆరోగ్యాన్ని పరిరక్షించడంలో టీకా కీలక పాత్ర పోషిస్తుందని డీఎంహెచ్‌ఓ డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ అన్నారు. బుధవారం జొహరాపురం యూపీహెచ్‌సీ పరిధిలోని హౌసింగ్ బోర్డు కాలనీ, ఇందిరమ్మ కాలనీ సచివాలయంలో జరిగిన ఆరోగ్య సురక్ష, జిల్లా వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పిల్లల ఆరోగ్యాన్ని పరిరక్షించడంలో కీలక పాత్ర టీకాలదేనన్నారు. గర్భిణులు, ఐదేళ్లలోపు పిల్లలకు టీకాలను క్రమం తప్పకుండా ఇవ్వాలని, ఆ వివరాలను ఎంసీపీ కార్డులో నమోదు చేసి ఎప్పటికప్పుడు ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. దీనివల్ల పిల్లలను వ్యాధుల బారి నుంచి కాపాడవచ్చన్నారు. ఆరోగ్య సురక్ష ఉచిత సేవలను ప్రజలు వినియోగించుకోవాలన్నారు. గర్భిణులు రక్తహీనత రాకుండా ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలను తీసుకోవాలని తెలిపారు. వైద్యాధికారి మౌనిక, డీసీఎం ప్రసాద్, ప్రాజెక్టనిస్టు ఖలీల్ ఉన్నారు.

రేపటి నుంచి రగ్బీ రెఫరీల శిక్షణ

కర్నూలు (టౌన్): నగర శివారులోని ఆదర్శ విద్యా మందిర్‌లో ఈనెల 17 నుంచి 19వ తేదీ వరకు మూడు రోజుల పాటు రగ్బీ రెఫరీలకు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర రగ్బీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణలో రగ్బీ ఇండియా సాంకేతిక ప్రతినిధులు అబ్దుల్ వలీ (జమ్ము కాశ్మీర్), ముఖేష్ (తమిళనాడు), నోయల్ మ్యాథ్యూస్ (చెన్నై), శ్రీకాంత్ (తెలంగాణ) పాల్గొంటున్నట్లు పేర్కొన్నారు. ఆటలో క్రీడాకారులకు తగిలే గాయాలకు ఎలా చికిత్స అందించాలి అన్న అంశంపై వివరిస్తారని తెలిపారు. ఈ కోర్సులో రాష్ట్ర వ్యాప్తంగా అర్హత సాధించిన 25 మంది రెఫరీలు హాజరవుతున్నట్లు వెల్లడించారు.

ఐసీడీఎస్ చెంతకు నవ జాత శిశువు



నవజాతి శిశువును స్వాధీనం చేసుకుంటున్న అధికారులు

డోన్ టౌన్ : ఎట్టకేలకు నవజాత శిశువును ఐసీడీఎస్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సాక్షి దినపత్రికలో ఈ నెల 13న ప్రచురితమైన రైలు పట్టాల పక్కన నవ జాత శిశువు అనే శీర్షికతో వచ్చిన వార్తకు ఐసీడీఎస్ అధికారులు స్పందించారు. ఈ నెల 12న మాతృ దినోత్సవం రోజు ఓ తల్లి తన బిడ్డను కర్నూలు రైల్వేగేట్ వద్ద వదలి వెళ్లడంతో సాక్షి దిన పత్రికలో వార్త ప్రచురించడం జరిగింది. స్పందించిన ఐసీడీఎస్ పీడీ శంశాద్‌బేగం, సూపర్‌వైజర్లు పరమేశ్వరి, పద్మావతి బుధవారం నవ జాత శిశువును అక్కున చేర్చుకున్న వెంకటాపురం గ్రామానికి చెందిన రామాంజనేయులు, లక్ష్మీదేవి దంపతులకు కృతజ్ఞతలు తెలిపారు. పట్టణ పోలీసు స్టేషన్ ఏఎస్‌ఐ భాస్కర్ సమక్షంలో నవ జాత శిశువును స్వాధీనం చేసుకున్నారు. అనంతరం కర్నూలులోని చైల్డ్ వెల్ఫేర్ కేంద్రానికి తరలించారు. అంగన్‌వాడీ టీచర్లు ఏస్తేరు రాణి, జులేఖ ఉన్నారు.

దత్తత ఇవ్వండి:

నవ జాత శిశువును మొదట అక్కున చేర్చుకున్న రామాంజనేయులు, లక్ష్మీదేవి దంపతులు తమకే దత్తత ఇవ్వాలని ఐసీడీఎస్ అధికారులను కోరారు. దేవుడిచ్చిన బిడ్డగా బాధ్యతగా చూసుకుంటామని వేడుకోగా నిబంధనల ప్రకారం దరఖాస్తు చేసుకుంటే ప్రాధాన్యతనిస్తామని పీడీ తెలిపారు.

వివాహిత ఆత్మహత్య



మృతిచెందిన అనుసూయమ్మ

హొళగుంద: స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలోని వందవాగిలి గ్రామానికి చెందిన గొల్ల అనుసూయమ్మ (30) అనే వివాహిత బుధవారం కడుపునొప్పి తాళలేక పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. సదరు మహిళకు 13 ఏళ్ల కిందట గ్రామానికి చెందిన సురేష్‌తో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమారులు. అనసూయమ్మ ఆరు నెలల నుంచి కడుపునొప్పితో బాధపడుతోంది. ఈ క్రమంలో బుధవారం విపరీతంగా నొప్పి రావడంతో తట్టుకోలేక ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగు మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించింది. కాసేపటికి గమనించిన కుటుంబసభ్యులు అపస్మారకస్థితిలో ఉన్న ఆమెను చికిత్స నిమిత్తం ఆదోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే అనుసూయమ్మ మరణించినట్లు అక్కడి వైద్యులు ధ్రువీకరించారు. మృతురాలి తండ్రి వెంకటేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ శ్రీనివాసులు వెల్లడించారు.



నృత్యాలు చేస్తున్న కళాకారులు



పాశ్చాత్య నృత్య ప్రదర్శన

నృత్యోత్సవ సంబరం



కర్నూలు కల్చరల్: సీక్యాంప్‌లోని టీజీవీ కళాక్షేత్రంలో వేసవి వినోద సంబరాలు కనుల పండువలా సాగాయి. రెండు రోజుల ఉత్సవాల్లో భాగంగా బుధవారం నాట్య గురువులు కరీముల్లా, రోహిత్, తేజేశ్వర్, సాయి ప్రదీప్, రామకృష్ణ శిష్య బృందాలు ప్రదర్శించిన కూచిపూడి, జానపద, పాశ్చాత్య నృత్యాలు అలరించాయి. అంతకు ముందుకు కళాకారులు, అతిథులు జ్యోతి ప్రజ్వలనతో వేడుకలను ప్రారంభించారు. డీఎస్పీ మహబుబ్ బాషా, సాహితీ స్రవంతి కన్వీనర్ జేఎస్ శేషయ్య, కళాక్షేత్రం కార్యదర్శి మహమ్మద్ మియ్యా, సభ్యులు యాంగటీశ్వరప్ప, ఇనాయతుల్లా, కన్వీనర్లు సంగా ఆంజనేయులు, వాల్మీకి రాముడు తదితరులు పాల్గొన్నారు.

మహానందిలో భక్తుల సందడి

మహానంది: వేసవి సెలవులు ఉండటంతో మహానంది ఆలయం భక్తులతో కిటకిటలాడుతోంది. వేలాది మంది భక్తుల రాకతో ఆలయ ప్రాంగణాలు సందడిగా మారాయి. భక్తులు ముందుగా రుద్రగుండం, బ్రహ్మగుండం, విష్ణుగుండం కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించి అమితానందం పొందుతూ వేసవితాపం నుంచి ఉపశమనం పొందుతున్నారు. భక్తులు శ్రీ కామేశ్వరీదేవి, శ్రీ మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. ఉదయం నుంచి రాత్రి వరకు దర్శనం కొనసాగగా రాత్రి ఏకాంతసేవ పూజల వరకు భక్తుల రద్దీ ఏ మాత్రం తగ్గలేదు.

మహానందీశ్వరుడి సన్నిధిలో..

మహానందీశ్వరుడి సన్నిధిలో ఆంధ్రప్రదేశ్ అగ్నిమాపక శాఖ రాష్ట్ర డైరెక్టర్ పి.వెంకటరమణ కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం పూజలు నిర్వహించారు. మహానందీశ్వరుడి దర్శనార్థం వచ్చిన వారికి నంద్యాల జిల్లా అగ్నిమాపకాధికారి యోగేశ్వర్‌రెడ్డి, ఆలయ ఇన్‌స్పెక్టర్ నీలకంఠరాజు స్వాగతం పలికారు. అనంతరం వారు శ్రీ కామేశ్వరీదేవి, శ్రీ మహానందీశ్వరస్వామి వారిని దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు.



మహానందిలోని రుద్రగుండం కోనేరులో భక్తుల పుణ్యస్నానాలు

ఇంటి నుంచే పోస్టల్ సేవలు!

- సాంకేతికతను అందిపుచ్చుకుంటున్న తపాలాశాఖ
- అందుబాటులో పోస్ట్ ఇన్ఫో, ఐపీపీబీ ప్రత్యేక యాప్‌లు
- మొబైల్‌ఫోన్‌తో సులభంగా సేవలు



హెడ్ పోస్టాఫీస్, కర్నూలు డివిజన్



మొబైల్‌ఫోన్‌లో ఐపీపీబీ యాప్ వివరాలు

కర్నూలు (న్యూటౌన్): పోస్టల్ సేవల కోసం గతంలో మాదిరిగా పోస్టాఫీసుకు వెళ్లనవసరం లేదు. ఇంటి వద్ద నుంచే మనకు అవసరమైన సేవలను ఆన్‌లైన్ ద్వారా పొందవచ్చు. ఇందుకు అవసరమైన డిజిటల్ బ్యాంకింగ్ వ్యవస్థను పోస్టాఫీసులు సమకూర్చుకుంటున్నాయి. ఇప్పటికే తపాలాశాఖ ఖాతాదారులకు సులభంగా, వేగంగా సేవలను అందించేందుకు పోస్టల్ ఇన్ఫో, ఐపీపీబీ అనే రెండు ప్రత్యేక యాప్‌లను అందుబాటులోకి తీసుకువచ్చింది. వీటి ద్వారా ఖాతాదారులు కార్యాలయానికి వెళ్లాల్సిన అవసరం లేకుండా తామున్న చోట నుంచే అన్ని పథకాలు, బ్యాంకు చెల్లింపులు, ఇన్సూరెన్స్ వంటి సేవలను వినినియోగించుకునేందుకు వెసులుబాటును కల్పించింది.

చెంతకే పోస్టల్ సేవలు...

పోస్టల్ డిపార్ట్‌మెంట్ పోస్ట్ ఇన్ఫో యాప్ ద్వారా నగదు పొందడం, కొత్త పొదుపు పథకాలను ప్రారంభించడంతో పాటు పోస్టల్ స్టాంప్స్ తీసుకోవచ్చు. ఇందు కోసం యాప్‌లో సర్వీస్ రిక్వెస్ట్ క్లిక్ చేస్తే చాలు పోస్టల్ ఎంప్లాయ్ ఇంటి వద్దకే వచ్చి ఖాతాదారులకు సేవలందిస్తారు. పోస్టల్ స్టాంపులను కూడా ఇంటి వద్దకే పంపిస్తారు. పోస్టల్ ఇన్సూరెన్స్ పథకాలు పొందాలంటే ఇన్సూరెన్స్ పోర్టల్‌లో ముందుగా వివరాలు నమోదు చేయాలి. పోస్టల్ ఎంప్లాయిస్ ఇంటి వద్దకే వచ్చి ఇన్సూరెన్స్ ప్రీమియం తీసుకుంటారు. ఎవరైనా పంపించే పార్సిల్ బరువును నమోదు చేసి దాని ఆధారంగా ఎంత చార్జీలు చెల్లించాలో పోస్టల్ ఇన్ఫో యాప్‌లో ముందే తెలుసుకోవచ్చు.

పోస్ట్ ఇన్ఫో యాప్ అందిస్తున్న సేవలు

పోస్ట్ ఇన్ఫో యాప్ మొబైల్‌ఫోన్‌లోని ప్లేస్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఇందులో సర్వీస్ రిక్వెస్ట్, ఆర్టికల్ ట్రాకింగ్, పోస్టేజ్, ఇన్‌ట్రస్ట్ క్యాల్కులేటర్, ఇన్సూరెన్స్, ఆన్‌లైన్ ఎన్‌పీఎస్, కంప్‌లెయింట్ ట్రాకింగ్, ఫీడ్ బ్యాక్, కంప్‌లెయింట్స్ నమోదు వంటి విభాగాలు ఉంటాయి. వీటి ద్వారా వివిధ డిపాజిట్లపై వడ్డీ లెక్కించుకునే సదుపాయం, ప్రస్తుతం అమలులో ఉన్న వడ్డీ రేట్ల ఆధారంగా పథకాలను ఎంచుకుని డిపాజిట్ చేస్తే వచ్చే ఆదాయ వివరాలను ముందుగానే తెలుసుకోవచ్చు. పిన్‌కోడ్ నంబర్‌ను పొందుపరిస్తే పోస్టల్ ఆఫీస్ పేరు, డివిజన్ పరిధి తెలియజేస్తుంది. అలాగే పోస్టల్ సేవలపై ఖాతాదారులు తమ అభిప్రాయాన్ని ఫీడ్‌బ్యాక్ ద్వారా తెలియజేసే సౌలభ్యాన్ని సైతం ఆ శాఖ కల్పించింది.

ఐపీపీబీ యాప్ సేవలు..

ఖాతాదారులు డిపాజిట్ చెల్లింపులు చేసుకునేందుకు వీలుగా ఇండియన్ పోస్టల్ పోస్ట్ పేమెంట్ బ్యాంక్ (ఐపీపీబీ) యాప్‌ను రూపొందించారు. దీని ద్వారా ఆర్టీజీఎస్, ఐఎంపీఎస్, ఆన్‌లైన్ బ్యాంకింగ్, డిజిటల్ లావాదేవీలు చేసుకోవచ్చు. ఆధార్ కార్డ్, మొబైల్ ఫోన్ నంబర్‌తో అకౌంట్ ఓపెన్ చేయాలి. ఇందులో ఖాతాదారులు రూ.లక్ష వరకు నిల్వ చేసుకోవచ్చు. ఖాతాదారులు ఐపీపీబీ నుంచి పీఓఎస్‌బీ (పోస్టాఫీస్ సేవింగ్స్ బ్యాంక్)కి ఎంత మొత్తమైనా చెల్లించే వీలుంది. అలాగే యాక్సిడెంట్ ఇన్సూరెన్స్, హెల్త్ ఇన్సూరెన్స్ సేవలు పొందవచ్చు.

సులభంగా సత్వర సేవలు



పోస్టల్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన పోస్టల్ ఇన్ఫో, ఐపీపీబీ యాప్‌ల ద్వారా వివిధ రకాల సేవలను ఖాతాదారులకు ఇంటి వద్ద నుంచే సులభంగా, వేగంగా అందుబాటులోకి తీసుకువచ్చాం. పోస్టాఫీస్‌కు వెళ్లనవసరం లేదు. పోస్టల్ ఇన్ఫో యాప్‌తో పోస్టల్ పథకాలకు సంబంధించి అన్ని విషయాలను సమగ్రంగా తెలుసుకోవచ్చు. ఐపీపీబీ యాప్ ద్వారా ఎక్కడైనా డిజిటల్ లావాదేవీలు చేసుకోవచ్చు. వీటిపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించేందుకు కృషి చేస్తున్నాం.

– జి జనార్ధన్‌రెడ్డి, పోస్టల్ సూపరింటిండెంట్, కర్నూలు డివిజన్

ఉపాధి కూలీపై దున్నపోతు దాడి

చిప్పగిరి: ఉపాధి పనులకు వెళుతున్న ఓ మహిళపై దున్నపోతు దాడి చేసి తీవ్రంగా గాయపరచిన సంఘటన బుధవారం జరిగింది. వివరాల్లోకి వెళితే.. స్థానిక ఎస్సీ కాలనీలో నివాసం ఉంటున్న తలారి గౌరమ్మ ఉదయం ఉపాధి పనికి వెళుతుండగా స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయం వద్ద ఓ దున్నపోతు దాడి చేసింది. గమనించిన తోటి కూలీలు దున్నపోతును తరమడానికి ప్రయత్నించగా రెచ్చిపోయిన దున్నపోతు మరోసారి గౌరమ్మపై కొమ్ములతో దాడి చేసింది. స్థానికులు దున్నపోతును తరిమేశారు. తీవ్రంగా గాయపడిన గౌరమ్మను కుటుంబసభ్యులు గుంతకల్లులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.